క్లుప్తంగా

కథల పోటీలో బహుమతి



సతీష్‌కుమార్ (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాల చెలిమి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ కథల పోటీలు-2023లో జిల్లాకు చెందిన రచయిత అనిశెట్టి సతీష్ కుమార్ రాసిన 'ప్లాస్టిక్ శత్రువు–మన మిత్రువు' బహుమతి పొందిందని ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం ఆదివారం తెలిపారు. త్వరలో జరిగే సమావేశంలో సతీష్‌కుమార్ ఈ బహుమతి అందుకోనున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా సిద్దిపేట కవులు బస్వరాజ్ కుమార్, కోణం పరశరాములు, బైతి దుర్గయ్య, పెందోట వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

ఏఐటీయూసీలో చేరికలు



సంఘంలో చేరిన కార్మికులు

హుస్నాబాద్: నియోజకవర్గంలో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీలో చేరారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్మికుల రక్షణ, వారి హక్కుల సాధన, పీఎఫ్, జీతాల పెంపునకు నిరంతర పోరాటం చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న మిషన్ భగీరథ కార్మికులందరినీ ఐక్యం చేస్తామని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మద్దూరు(హుస్నాబాద్): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతోగానో దోహదపడతాయని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దొంగతనాలు, నేరాలు కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ నందనబోయిన నర్సింహులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో ఇటీవల మృతిచెందిన కాస యాదగిరి కుటుంబానికి ఆదివారం పెద్ద మాసాన్‌పల్లి సేవా సమితి ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. పిల్లల చదువులకు సహకరిస్తామని పేర్కొన్నారు.

పరామర్శ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అక్కారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజు తండ్రి కమ్మరి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల దళిత కాలనీలో ఆదివారం దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దండోరా సాధించిన విజయాలను ప్రతి గడపకు తీసుకువెళ్లి విశ్వరూప మహాసభను విజయవంతం చేసే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దండోరా నాయకులు నర్సయ్య, దుర్గయ్య, రాజలక్ష్మి, బిక్షపతి, రామచంద్రం, బాబు, యాదగిరి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అందుబాటులో ఉంటా

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: మత్స్యకారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్ పట్టణ మత్స్యకారుల సంఘం ఎన్నికలు ఆదివారం జరుగగా నూతన పాలక కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. కాగా కొత్తగా ఎన్నికైనా మత్స్యకారుల సంఘం డైరెక్టర్‌లు సంతోష్, నర్సింలు, శ్రీకాంత్ తదితరులు మర్యాద పూర్వకంగా వెళ్లి సునీతారెడ్డిని కలువగా, ఆమె వారందరిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నాగుల పంచమికి ముస్తాబు

కోటిపడగల సంతాన నాగదేవత ఆలయంలో ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో నాగదేవత



ఆలయంలో నాగదేవతల విగ్రహాలు



భక్తులు వెలిగించిన దీపాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాసం అంటేనే పండగలు, పూజలకు ప్రత్యేకం. సోమవారం నాగుల పంచమి సందర్భంగా జిల్లాలోని నాగదేవత ఆలయాలు ముస్తాబయ్యాయి. జిల్లాలోనే ప్రముఖ సిద్దిపేట కోటిపడగల సంతాన నాగదేవత ఆలయంలో ఏర్పాట్లు పూరయ్యాయి. ఈ ఆలయంలో గత కొన్నేళ్లుగా నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో నాగదేవత భక్తులకు దర్శనం ఇస్తుంది. ఆలయానికి వచ్చే భక్తులు పుట్టలో పాలు పోసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు. దైవ దర్శనానికి ఒకేసారి భక్తులు లోనికి రాకుండా క్యూలో వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్, వీరాపూర్, బేగంపేట గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను ఆదివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పరామర్శించారు. అధైర్య పడొద్దని.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, దరువు ఎల్లన్న, పార్లమెంట్ ఇంచార్జి ప్రవీణ్‌రావు, మండల అధ్యక్షుడు అశోక్, కొలిపాక రాజు, మల్లేశం, శ్రీనివాస్, అనిల్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతాప్‌రెడ్డికి ఆంజనేయస్వామి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా కొనసాగుతుంది. ఆదివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వారికి గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆంజనేయ స్వామి జ్ఞాపికను అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, గజ్వేల్, మర్కుక్ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెండె మధు, కరుణాకర్‌రెడ్డి, నాయకులు గుంటుకు రాజు, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

దుబ్బాకటౌన్: పట్టణంలోని బాలాజీ ఆలయంలో ఈనెల 23వ తేదీ నుంచి జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆదివారం ఆలయ కమిటీ ఆహ్వానపత్రిక అందించింది. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దుబ్బాక బాలాజీ ఆలయం గొప్ప పుణ్యక్షేత్రమని, అనతి కాలంలోనే తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచడం సంతోషకరమన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు సైతం ఆహ్వానం అందిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి చింత రాజు, బాధ్యులు ఆకుల దేవేందర్, నల్ల శ్రీనివాస్, ఉమామహేశ్వర్ తెలిపారు.



ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందిస్తున్న ఆలయ కమిటీ

'ఈశా' ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్ ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తూ వారిని చైతన్యవంతులుగా చేసేందుకు కృషి చేస్తున్న 'ఈశా' ఫౌండేషన్ సేవలు అభినందనీయమని గజ్వేల్ ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలోగల మినీ స్టేడియంలో రెండ్రోజులుగా జరుగుతున్న 'ఈశా' 15వ గ్రామోత్సవం ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఉరుకుల, పరుగుల జీవితంలో తీరిక లేకుండా గడుపుతున్న ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు ఎనలేనివని కొనియాడారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా పురుషుల విభాగంలో వా లీబాల్, మహిళల విభాగంలో త్రోబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

అక్రమ అరెస్టులు సరికాదు

గజ్వేల్‌రూరల్: అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతులను ఆపలేరని ప్రభుత్వ తీరుపై బీజేపీ నేతలు మండిపడ్డారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మహేశ్వర్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గురువారెడ్డి, నలగామ శ్రీనివాస్, మనోహర్‌యాదవ్, మహేష్, సురేష్, పంజాల అశోక్‌గౌడ్, మధుసూదన్‌తో పాటు వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



హుస్నాబాద్: రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు.



దౌల్తాబాద్‌లో..



దుబ్బాకలో..



మద్దూరులో..

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



హుస్నాబాద్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ పోటీలకు హుస్నాబాద్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బూట్ల రాజమల్లయ్య, కొలుగూరి సత్యనారాయణ రెడ్డి, జంగపల్లి వెంకటనర్సయ్యలు ఎంపికయ్యారు. వీరు ముగ్గురు ఈనెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. లాన్ టెన్నిస్ విభాగంలో రాష్ట్రస్థాయిలో రాజమల్లయ్య తృతీయ స్థానంలో నిలిచారు. సత్యనారాయణ రెడ్డి బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, స్విమ్మింగ్‌లో వెంకటనర్సయ్య రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే



నాయకులకు నియామకపత్రాలు అందజేస్తున్న సూర్యవర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షు డు సూర్యవర్మ అన్నారు. టీపీసీసీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీలుగా ఆర్షద్, సిరాజ్, డీసీసీ సేవాదళ్ జనరల్ సెక్రటరీగా మోతే కుమార్ ఎన్నికకాగా వారికి ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీలు, బడుగు బలహీన వర్గాలకు అండగా కాంగ్రెస్ మాత్రమే ఉంటుందన్నారు. ఎన్నికలను నేపథ్యంలో పథకాలు ప్రవేశపెడుతున్నారని.. అవి కూడా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే అందిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని.. లేకపోతే మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిద్దిపేట అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ సోమవారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకోనున్నట్టు ఈసందర్భంగా తెలిపారు.

24న గజ్వేల్‌లో గద్దర్ సంస్మరణ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్: టీపీటీఎఫ్ అధ్వర్యంలో ఈనెల 24న గజ్వేల్‌లోని టీవైఆర్ గార్డెన్స్‌లో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు ఆ ఫెడరేషన్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ వెల్లడించారు. ఆదివారం గజ్వేల్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ కాశీం, విమలక్క హాజరవుతున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జోన్ కో–కన్వీనర్ విద్యాసాగర్, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు చేబర్తి యాదగిరి, సీనియర్ నాయకులు ఎల్లయ్య, ధమ్మని మల్లయ్య, పాపిరెడ్డి, సత్తయ్య, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం



మందులను పంపిణీ చేస్తున్న కత్తి కార్తీకగౌడ్

దుబ్బాక: ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి కత్తి కార్తీకగౌడ్ అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కత్తి కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరానికి దాదాపు 900 మందికిపైగా హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా అవసరమైన వారికి ఉచితంగా అద్దాలతో పాటు మందులను పంపిణీ చేశారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ రంగాలకు చెందిన 20 మందికిపైగా రాజీవ్‌గాంధీ సేవా పురస్కారాలు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంతపాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవిరెడ్డి, శ్రీనివాస్‌రావు, జలేందర్‌రెడ్డి, దీపక్ పాల్గొన్నారు.

కార్మికులంతా బీఆర్ఎస్ వైపే



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

సిద్దిపేటజోన్: బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో త్వరలో కార్మికులతో జిల్లా మహాసభ నిర్వహించనున్నట్టు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్ తెలిపారు. ఆదివారం సిద్దిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్‌టీయూ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కార్మికులంతా బీఆర్ఎస్ ప్రభుత్వం వైపే ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు బండారి నర్సింలు, దుర్గం శ్రీనివాస్, పయ్యావుల రాజయ్య, యాదయ్య, సంజీవులు, శోభన్, బాలు, శ్రీనివాస్, సాజీద్, శ్రీమతి, గెల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

హుస్నాబాద్‌రూరల్: బీసీలకు రాజకీయ పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని బీసీ సంఘం నాయకుడు పచ్చిమట్ల రవీందర్ కోరారు. ఆదివారం మడద, మహ్మదాపూర్ గ్రామాల్లో బీసీ చైతన్య యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించి వారికి రాజకీయ ప్రాధాన్యం ఇచ్చినట్లుగా బీసీలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తాళ్లపెల్లి శ్రీనివాస్, చిలుక రవి, బాలగోని తిరుపతి, బండారి చంద్రం, మామిడి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

◆ ముదిరాజ్‌లు ఐక్యత చాటాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ముదిరాజ్‌లు ఐక్యత చాటాలని ముదిరాజ్ మహాసభ జిల్లా యూత్ అధ్యక్షుడు సత్యం అన్నారు. ఆదివారం అంతాయిగూడలో ముదిరాజ్ సంఘం నాయకులు సత్యంను సన్మానించారు. మారుతున్న కాలనుగుణంగా ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, కనకయ్య, కరుణాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కెల్విన్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు కొనసాగిన శిబిరానికి భారీగా రోగులు తరలివచ్చారు. కార్యక్రమంలో గవ్వ కిషన్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, బాలకిషన్, హరికృష్ణ, సుజిత్, శ్రావణ్, దర్గారెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, అరవింద్ సంపయ్య, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

◆ నేతన్నలకు కేంద్రం అండ

కోహెడరూరల్(హుస్నాబాద్): నేతన్నలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కేంద్రం అండగా నిలుస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరాములపల్లి క్లస్టర్ పరిధిలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హ్యాండ్లూమ్ క్లస్టర్ కోసం సుమారు రూ.99 లక్షల నిధులు మంజూరు చేయగా పీఎం మోదీ, ఎంపీ బండి సంజయ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, సంజీవ్‌రెడ్డి, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కొండపాక(గజ్వేల్): నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించి కట్టుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద రూ. 5 లక్షలు కేటాయించాలని ఆదివారం సీపీఎం కొండపాక మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. దళితబంధు, బీసీ బంధు ప్రజల మధ్య చిచ్చు పెట్టిందన్నారు. అలాగే ఇటీవల వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తాటోజు రవీంద్రచారి, కనకయ్య, కనకచారి, ప్రభాకర్, శ్రీనివాస్, కొమురయ్య, నరహరి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ర్యాలీకి తరలిరావాలి

తొగుట(దుబ్బాక): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం దుబ్బాకకు వస్తున్న సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు హబ్సీపూర్ నుంచి దుబ్బాక వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.